ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 282 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 14 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

కొత్త కార్డులతో పాటూ వీటికి అప్లై చేసుకోవచ్చు

ఈ సేవల్ని పొందాలని అధికారుల సూచనలు

మే 14, (రిపబ్లిక్ న్యూస్): రేషన్ కార్డు లేని వారు తప్పకుండా కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేదలకి శుభవార్త చెప్పింది! కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు బుధవారం నుండి మొదలయ్యాయి. జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులు ఇస్తారు. సచివాలయాల్లో సేవలు పొందవచ్చు, వాట్సాప్ ద్వారా కూడా అందుబాటులోకి వస్తాయి. కొత్తగా దరఖాస్తు చేసుకోవడమే కాకుండా, పేరు చేర్చడం, తొలగించడం, చిరునామా మార్పు వంటి సేవలు కూడా ఉన్నాయి. మరిన్ని వివరాల కోసం వెంటనే సంప్రదించండి!

ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.. బుధవారం నుంచి కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారితో పాటు, ఇప్పటికే బియ్యం కార్డులు ఉన్నవారికి కూడా జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులు ఇస్తారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు పొందవచ్చు. వచ్చే సోమవారం నుండి వాట్సాప్ ద్వారా కూడా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం ఒంటరి మహిళలు, ఆశ్రమాల్లో ఉండేవారికి కూడా బియ్యం కార్డులు ఇవ్వనుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బియ్యం కార్డు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం ఒక్కటి మాత్రమే కాదు.. మరికొన్ని సేవల్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. సచివాలయాల్లో రైస్ కార్డులకు సంబంధించి ఏడు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. 'కొత్త బియ్యం కార్డు, కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం, కార్డును విభజించడం, ఉన్న సభ్యుల పేర్లను తొలగించడం, కార్డును తిరిగి ఇవ్వడం, చిరునామా మార్పులు చేసుకోవడం, ఆధార్ కార్డు వివరాల్లో తప్పులను సరిదిద్దడం' వంటి సేవలను సచివాలయాల్లో పొందవచ్చు. దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. అర్హత ఉండి రైస్ కార్డు లేని పేదలందరూ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొత్త రైస్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం నెల రోజుల పాటు దరఖాస్తులను స్వీకరిస్తుంది. అనంతరం వాటిని పరిశీలించిన తర్వాత అర్హులకు కార్డులు ఇస్తారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తప్పుడు చిరునామాలు, పేర్లలో తప్పులు ఉండటం వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు మార్పులు చేసుకునే అవకాశం రావడంతో ఊరట దక్కింది. పాత రేషన్ కార్డుల లబ్ధిదారులకు జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులు ఇస్తారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కొత్త రేషన్ కార్డుతో పాటుగా ప్రభుత్వం స్వీకరించే దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.

కొత్త రేషన్‌కార్డు

కొత్త సభ్యుల చేర్పు

కుటుంబ సభ్యుల విభజన

చనిపోయిన వారి పేర్ల తొలగింపు

అడ్రస్ మార్పు

బియ్యం కార్డును సరెండర్ చేయడం (వదులుకోవడం)

ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న బియ్యం కార్డు స్థానంలో ప్రభుత్వం కొత్తగా క్యూఆర్ కోడ్ ఉన్న స్మార్ట్‌కార్డుల్ని జారీ చేయనుంది. గత ప్రభుత్వంలో మాదిరిగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ఫొటోలేవీ ఉండవు. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి.. అడ్రస్ మార్చుకోవచ్చు. కార్డుపై కుటుంబ యజమాని పేరు, ఫొటో కుటుంబ సభ్యుల సంఖ్య కార్డులో పెద్దగా బియ్యం కార్డు నంబరు రేషన్ షాపు ఐడీ, అడ్రస్, క్యూఆర్ కోడ్ కార్డు వెనుక భాగంలో కుటుంబ సభ్యుల పేర్లు వారు పుట్టిన తేదీ, వయసు, బంధుత్వం (పర్మినెంట్ అడ్రస్) శాశ్వత చిరునామా పొందు పరుస్తారు. తహసీల్దారు కార్యాలయం (మండలం) 1967 టోల్‌ఫ్రీ నంబరు ఉంటుంది. కార్డు లేని ప్రతి ఒక్కరు తప్పకుండ దరఖాస్తు చేసుకోండి.

వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు: వాట్సప్ గవర్నెన్స్ ద్వారాను ఈ నెల 12వ తేదీ తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అకాల వర్షంతో రైతులకు పంట నష్ట పరిహారం అందరికీ అందజేస్తామన్నారు. ఇప్పటి వరకూ 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రైతులు ఆందోళన చెందొద్దు: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతుల ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ధాన్యం కొనుగోలుపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పశ్చిమగోదావరిలో 7.5 లక్షల టన్నులు ధాన్యం ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 5.5 లక్షల టన్నులు కొనుగోలు చేశామని అన్నారు. రైతులకు రూ.1180 కోట్లు జమ చేశామన్నారు. అదనంగా లక్ష టన్నులు కొనుగోలు చేయడానికి అనుమతించామన్నారు. ఏలూరు జిల్లాలో 3.55 లక్షల టన్నులు పుట్టపర్తి అవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 2.20 లక్షల టన్నులు కొనుగోలు చేసి, రైతులకు రూ.487 కోట్లు జమ చేశామని మంత్రి మనోహర్ తెలిపారు. అదనంగా 50 వేల టన్నులు కొనుగోలుకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

రేషన్ కార్డు ఈ-కేవైసీ చేయించుకున్నారా? - లేకుంటే మీకు ముద్దలేనట్లే!

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

రఫేల్ జెట్లే నడుపుతున్నారు.. మహిళలకు ఆ పోస్టులు ఇవ్వరా? :కేంద్రానికి సుప్రీం ప్రశ్న

మహిళలు రఫేల్ యుద్ధ విమానాలే నడుపుతున్నప్పుడు.. సైన్యంలోని లీగల్ బ్రాంచీల్లోకి వాళ్లను ఎందుకు తీసుకోవడం లేదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

ఢిల్లీ, మే 14, (రిపబ్లిక్ న్యూస్): భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచీ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆ పోస్టులకు స్త్రీ-పురుష నిష్పత్తి వర్తించదని నిబంధన ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు అనుసరించడం లేదని అడిగింది. రఫేల్ లాంటి అత్యాధునిక యుద్ధ విమానాలనే అమ్మాయిలు నడుపుతున్నప్పుడు.. లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వడం లేదని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉనప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్పై ఇటీవల విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "భారత వాయుసేనలో మహిళలు రఫేల్ యుద్ధ విమానాలను నడిపేందుకు అనుమతి ఉన్నప్పుడు.. ఆర్మీలోని లీగల్ బ్రాంచీల్లో పురుషుల కంటే ఎక్కువగా మహిళలను విధుల్లోకి తీసుకోవడంలో కష్టమేముంది? స్త్రీ-పురుష భేదంతో సంబంధం లేకుండా అవి తటస్థ పోస్టులను కేంద్రం చెప్పినప్పుడు.. మహిళలకు ఎందుకు ఎక్కువ పోస్టులను కేటాయించడం లేదు? స్త్రీ-పురుష సమానత్వం అంటే మహిళలు, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడం కాదు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా అర్హత ఉంటే అవకాశం ఇవ్వడమే" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది.

సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి :ఏపీ సీఎం చంద్రబాబు

ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్లోనే అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

విజయవాడ, మే 14, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్లోనే అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం వచ్చిందని చెప్పారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం చేసుకున్నామన్నారు. విజయవాడలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్ ఏఐ కాంక్లేవ్కు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.



"ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనైనా సులువుగా చేసుకునే పరిస్థితి వచ్చింది. గతంలో ఎక్కడ చూసినా రహదారులు గుంతలతో కనిపించేవి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రోడ్లను చక్కగా నిర్మించారు. ఇప్పుడు ఎక్కడ చూసినా జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోంది. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తున్నాం. నేను ఎప్పుడూ విద్యార్థిగానే ఉంటా.. అనునిత్యం కొత్త విషయాలు తెలుసుకుంటా. సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంది. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారు.. అందులో తెలుగువాళ్లే అధికం. నా ఆలోచన ఒకటే మనం బాగుంటేనే చాలదు.. తిరిగి సమాజానికి ఇవ్వాలి" అని చంద్రబాబు అన్నారు.

భవిష్యత్తులో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్:పురందేశ్వరి

ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. ప్రధాని మోదీ హయాంలో ఐదో స్థానానికి చేరిందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు.

విజయవాడ, మే 14, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. ప్రధాని మోదీ హయాంలో ఐదో స్థానానికి చేరిందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. భవిష్యత్తులో జపాన్ ను అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని అభిప్రాయపడ్డారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పదాధికారులు, నీటిసంఘాల అధ్యక్షుల సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ నూటికి 58 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. 70 శాతం మంది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉన్నారని పేర్కొన్నారు. పర్యావరణ మార్పులు రైతులపై ప్రభావం చూపుతున్నాయని.. వర్షపాతం చూసుకుని అధిక దిగుబడినిచ్చే విత్తనాలు ఎంచుకోవడం ఉత్తమమని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. "కనీస మద్దతు ధరపై చట్టబద్ధత కష్టం. ఒకే పంటను వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పరిస్థితుల మధ్య పండించడమే దీనికి కారణం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విత్తనాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం జీన్ బ్యాంకును ప్రారంభించింది. 100 వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేకదృష్టి సారించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను 2006లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేదు?" అని పురందేశ్వరి ప్రశ్నించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

చరిత్రలో నేటి ప్రత్యేకత

- దేవమాత రియాకు నివాళులు అర్పించే నేపథ్యంలో మాతృ దినోత్సవం మొదటిసారిగా గ్రీసు దేశంలో నిర్వహించారు.
- 1574 : ప్రముఖ సిక్కు గురువు గురు అమర్‌దాస్ మరణం (జ. 1479). (చిత్రంలో)
- 1657 : మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ జననం (మ. 1689).
- 1811 : పరాగ్వే జాతీయదినోత్సవం. ఈ రోజు స్పెయిన్ నుండి స్వాతంత్ర్యం పొందింది.
- 1984 : అమెరికన్ కంప్యూటర్ ప్రోగ్రామర్. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జూకర్‌బర్గ్ జననం.
- 1987 : తెలుగు, మళయాళ, హిందీ చిత్రాల నటీమణి మధురిమ జననం.
- 2004 : డాక్టర్ వై. ఎస్. రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 20వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు.

మాతృ దినోత్సవం

అమర్‌దాస్

శంభాజీ

పరాగ్వే

మార్క్ జూకర్‌బర్గ్

మధురిమ

వై. ఎస్. రాజశేఖర రెడ్డి

ఉత్కంఠ కలిగించే వెబ్‌సిరీస్ ఫైనల్ సీజన్ రెడీ!

'స్ట్రేంజర్ థింగ్స్' సీజన్ 5 షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది.

నెట్‌ఫ్లిక్స్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన వెబ్ సిరీస్‌లలో 'స్ట్రేంజర్ థింగ్స్' ఒకటి. ఇప్పటికే దీని నాలుగు సీజన్ల లు వచ్చి విశేషమైన ఆదరణ సొంతం చేసుకుని రికార్డులు సృష్టించగా.. ఇప్పుడు ఐదో సీజన్ (స్ట్రేంజర్ థింగ్స్ సీజన్ 5) ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. దీని షూటింగ్ పూర్తయినట్లు తాజాగా టీమ్ తెలిపింది. నవంబర్‌లో ఇది క్లాసిక్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ సిరీస్ ఐదో సీజన్ ఫైనల్ అని టీమ్ వెల్లడించింది. ఎనిమిది ఎపిసోడ్లతో ఇది రూపొందినట్లు తెలిపింది. షూటింగ్ పూర్తయినట్లు తెలిపిన దర్శకుడు రాస్ డఫర్ బావోద్వేగంతో పోస్ట్ పెట్టారు. గత సీజన్లలో కంటే ఇందులో చాలామంది బాలనటులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో నటించినవారు కేవలం నటీనటులు మాత్రమే కాదని.. వారంతా తన కుటుంబమని చెప్పారు. టీమ్ మొత్తం అంకితభావంతో పనిచేసినట్లు తెలిపారు. ఈ సీజన్ కు మంచి ముగింపు ఇవ్వడం కోసం ఎంతో శ్రమించిందన్నారు. 2024 జనవరిలో సీజన్ 5 షూటింగ్ను ప్రారంభించిన విషయం తెలిసిందే. స్ట్రేంజర్ థింగ్స్ సీజన్ 4 2022లో విడుదలై అత్యధిక వీక్షణలు పొందిన సిరీస్ గా నిలిచింది. నెటిక్స్ ట్రెండింగ్ వెబ్ సిరీస్ లిస్టో చాలాకాలంపాటు 'స్క్విడ్ గేమ్' తర్వాత స్థానంలో కొనసాగింది. ఇప్పుడు దీని ఐదో సీజన్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఎదురుచూస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'కింగ్ డమ్' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే!

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'కింగ్డమ్'. మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా తాజాగా వాయిదా పడింది. దీన్ని జులై 4న విడుదల చేయనున్నట్లు టీమ్ తెలిపింది. ఈమేర ఓ నోట్ను పంచుకుంది. "అనుకున్న సమయానికి సినిమాను రిలీజ్ చేయాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ప్రస్తుతం దే నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దీన్ని వాయిదా వేస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రచారాలు, సెలబ్రేషన్స్ అంటూ సందడి చేయకూడదు. అందుకే మేం సినిమా జులై 4న ప్రపంచవ్యాప్తంగా ముందుకు తీసుకురానున్నాం. మీ అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం" అని టీమ్ తెలిపింది. మొదట ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలని భావించారు. మే 30కు వాయిదా పడిం ఇప్పుడు మరోసారి జులై 4కు వెళ్లింది. విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న ఈ సినిమాలోని పాటలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటున్నాయి. ఇటీవలే ఇండ 'హృదయం లోపల' అంటూ సాగే పాటని విడుదల చేయగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న 'కింగ్డమ్'లో విజయ్ దేవరకొండ గూఢచారిగా కనిపించనున్నారు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

'కథను అందంగా చెప్పగలిగేవారే".. కోహ్లి రిటైర్మెంట్ పై అనుష్క శర్మ స్టోరీ వైరల్

కోహ్లి రిటైర్మెంట్పై అనుష్క శర్మ ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. తన భర్త సాధించిన విజయంపై ఆనందం వ్యక్తంచేశారు.

టెస్టు క్రికెట్లో తన సుదీర్ఘ ఇన్నింగ్స్కు ముగింపు పలికాడు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి. ఈ ఫార్మాట్లో ఎన్నో మరుపురాని క్షణాలను లిఖించిన కింగ్.. రెండు రోజుల క్రితం టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈసందర్భంగా విరాట్ సతీమణి అనుష్క శర్మ మరోసారి తన ఇన్స్టాగ్రామ్లో ఎమోషనల్ స్టోరీని పోస్ట్ చేశారు. ఈ కష్టతరమైన ఫార్మాట్లో తన భర్త ఎలా విజయం సాధించాడో చెప్పారు. "కథను అందంగా చెప్పగలిగేవారే టెస్టు క్రికెట్లో విజయం సాధిస్తారు. ఆ కథ చాలా సుదీర్ఘమైనది, లోతైనది. పిచ్ పరిస్థితి ఎలా ఉంది..? స్వదేశమా, విదేశమా అనేవాటిని పట్టించుకోని కథ అది" అని అనుష్క తన ఇన్స్టా స్టోరీలో పంచుకున్నారు. వాస్తవానికి దీన్ని ఓ స్టాండప్ కమెడియన్ పోస్ట్ చేశారు. విరాట్ కోహ్లికి అంకితమిస్తూ కమెడియన్ వరుణ్ గ్రోవర్ ఓ కవిత రాశారు. "టెస్టు క్రికెట్ అనేది ఓ వర్ణణాత్మక, కవితాత్మక ఆట. అందుకే ఇది చాలా ప్రత్యేకం. ఐదు రోజులు, నాలుగు ఇన్నింగ్స్, 22 మంది స్పెషలిస్టు ఆడే ఆట. ఒక్కోసారి ఆడుతుండగానే వాతావరణంలో మార్పులు వస్తాయి. పిచ్ కండిషన్ మారుతుంది. టాస్ అదృష్టం కీలకం అవుతుంది. వీటన్నింటితో పాటు మానసికంగా ఎన్నో లెక్కలు కూడా అవసరం. ప్రతి క్రీడ మన జీవితాన్ని ఎంతోకొంత ప్రతిబింబించినప్పటికీ.. టెస్టు క్రికెట్ మాత్రం ఒక సాహిత్య నవల లాంటిది. అనేక అంశాల మేళవింపు లాంటిది. అందుకే.. ఆ నవలలోని కథను అందంగా చెప్పేవారే టెస్టు క్రికెట్లో విజయం సాధిస్తారు" అని వరుణ్ రాసుకొచ్చారు. ఇందులోని అంశాలను తీసుకొని అనుష్క తన ఇన్స్టాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన స్టోరీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. కోహ్లి రిటైర్మెంట్ ప్రకటించిన రోజు కూడా అనుష్క భావోద్వేగానికి గురయ్యారు. "అందరూ రికార్డులు.. మైలురాళ్ల గురించి మాట్లాడతారు. నాకు మాత్రం నువ్వు ఎప్పుడూ చూపించని కన్నీళ్లు.. ఎవరూ చూడని యుద్ధాలు.. సుదీర్ఘ ఫార్మాట్పై అచంచలమైన ప్రేమ గుర్తుండిపోతాయి. ప్రతి టెస్టు సిరీస్ తర్వాత నువ్వు మరింత గొప్పగా.. ఇంకాస్త వినయంగా తిరిగొచ్చేవాడివి. నువ్వు ఎదిగిన తీరును పక్కనే ఉండి చూడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా" అని నటి రాసుకొచ్చారు.

ఇంటి చిట్కాలు

పొరపాటున కూడా కొందరు దొండకాయ ఎట్టి పరిస్థితుల్లో తినకూడదు, ఎవరు దూరంగా ఉండాలో తెలుసా?

దొండకాయలో ఫైబర్, విటమిన్ బి1, బి2, బి3, బి6, బి9, విటమిన్ సి, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, కొందరు మాత్రం దొండకాయ తినకూడదు.

దొండకాయ.. కూరగాయల్లో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. చాలా మంది దీన్ని ఇష్టంగా తింటుంటారు. దొండకాయ వేపుడు, దొండకాయ ఫ్రై, దొండకాయ పులుసు ఇలా రకరకాలుగా వండుకుని తింటారు. ఇంకొందరు సాంబార్‌లో కూడా దొండకాయను వాడతారు. ఇక, దొండకాయ తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. దొండకాయలో ఫైబర్, విటమిన్-బి1, బి2, బి3, బి6, బి9, విటమిన్-సి, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, కొందరు మాత్రం దొండకాయ తినకూడదు. దొండకాయను ఎవరు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

దొండకాయతో ఆరోగ్య ప్రయోజనాలు

దొండకాయలో థయామిన్ ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్‌లను గ్లూకోజ్‌గా మార్చే పోషకం. ఇది శరీరంలో శక్తి స్థాయిలను ఎక్కువగా ఉంచుతుంది, జీవక్రియను నియంత్రిస్తుంది. దొండకాయ కొన్ని జన్యుపరమైన వ్యాధులను కూడా నయం చేస్తుంది. దొండకాయలు తినడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. దొండకాయలో స్థూలకాయాన్ని నిరోధించే గుణాలు ఉంటాయి. దొండకాయ కాన్సర్ ముప్పును కూడా తగ్గిస్తుంది. ఇక ఇందులోని బేటా కెరోటిన్ విటమిన్- ఏగా రూపాంతరం చెంది కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. ఆస్తమాను నివారించడంలో కూడా దొండకాయలు కీలక పాత్ర పోషిస్తాయని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అయితే, ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నప్పటికీ కొందరు మాత్రం తినకూడదు. వారెవరో ఓ లుక్కేద్దాం.

తక్కువ రక్తపోటుతో బాధపడేవారు

దొండకాయ తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, ఒత్తిడి మొదలైన సమస్యలు తగ్గుతాయి. కానీ అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. దీని కారణంగా లో బీపీ సమస్యతో బాధపడేవారు దొండకాయ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దొండకాయను ఎక్కువ మోతాదులో తీసుకుంటే మీ సమస్య తీవ్రమవుతుంది. నీరసం, మూర్ఛ, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవచ్చు. లో బీపీతో బాధపడేవారు దొండకాయను మితంగా తీసుకోవడమే మేలు.

అలెర్జీ సమస్యలు

ఈ రోజుల్లో చాలా మంది చర్మ, శ్వాస అలెర్జీ సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారు దొండకాయ తినకపోవడమే మేలు. ఇలాంటి వారు పొరపాటున దొండకాయ తింటే వికారం లేదా వాంతులు అవుతాయి. అంతేకాకుండా చర్మంపై దురద, మంట, వాపు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. అందుకే అలెర్జీ సమస్యలతో బాధపడేవారు దొండకాయకి దూరంగా ఉండాలి.

శస్త్రచికిత్స చేయించుకునేవారు

ఒక వ్యక్తి శస్త్రచికిత్స సమయంలో లేదా ఆపరేషన్ చేయించుకునే కొన్ని రోజుల ముందు దొండకాయ తినకపోవడమే మేలు. అది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. ఇది శస్త్రచికిత్స సమయంలో సమస్యలను కలిగిస్తుంది. శస్త్రచికిత్సకు కొన్ని రోజుల ముందు దొండకాయ తినడం మానుకోండి. వీలైతే, 1-2 వారాల ముందుగానే దీన్ని తినడం మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు

గర్భధారణ సమయంలో దొండకాయలు తినడం అంత మంచిది కాదని నిపుణులు అంటున్నారు. వీళ్లు పరిమిత పరిమాణంలో తింటే మేలు జరుగుతుంది. ఎక్కువగా తింటే మంచిది కాదంటున్నారు. పాలిచ్చే తల్లులు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఎక్కువగా దొండకాయలు తింటే పిల్లలకు జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

డయాబెటిస్

రక్తంలో అధిక చక్కెర స్థాయిలు ఉంటే దొండకాయను బేషుగ్గా తినవచ్చు. అయితే, రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువ ఉన్నప్పుడు మాత్రం దొండకాయ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు నిపుణులు. దొండకాయ తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో, పరిస్థితి మరింత దిగజారవచ్చు. దీంతో నీరసం, కళ్లు తిరగడం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.